సాక్షి ఒడిశా
ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,93,540లు, బంగారం 10 మిల్లీగ్రాములు వెండి 15 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

ఒడిశా సివిల్స్ ఫలితాలు..



ఒడిశా సివిల్స్ ఫలితాలు విడుదలయ్యాయి. టాపర్‌గా శ్వేత శ్రీ నిలిచింది.

- 8లో



అక్రమాలపై లేఖాస్త్రం

ఓఎస్ఎస్‌సీ అక్రమాలపై యువకులు లేఖాస్త్రం సంధించారు. రాష్ట్రపతికి లేఖలు పంపించారు.

- 8లో

న్యూస్‌రీల్

వసతి గృహంలో అసౌకర్యాలు

● ఆందోళనకు దిగిన విద్యార్థినులు



వసతిగృహం మెయిన్‌గేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలోని పాగొడాబలిలో ఉన్న ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో అసౌకర్యాలు నెలకున్నాయి. కనీస సౌకర్యాలు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహం సౌకర్యాలు మెరుగు పరచాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు శనివారం ఆందోళనకు దిగారు. హాస్టల్ మెయిన్ గేట్ వద్ద నిరసన తెలియజేశారు. నాణ్యమైన ఆహారం పెట్టడం లేదని, మరుగుదొడ్లు, వసతి గృహం గదులు దుర్గంధంగా ఉంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను నిర్వాహకుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో ఆందోళనకు దిగడం అనివార్యమైందని వారంతా అన్నారు. దీనిపై హాస్టల్ ఇన్‌చార్జి తరంగమయి మిశ్రొ మాట్లాడుతూ.. అటువంటిదేమీ లేదని తోసిపుచ్చారు. అయితే తమకు సౌకర్యాలు మెరుగు పరిచే వరకు నిరసను కొనసాగిస్తామని విద్యార్థినులు స్పష్టం చేశారు.

ఏడుగురు జూదరుల అరెస్టు



అరెస్టయిన జూదరులతో పోలీసు సిబ్బంది

రాయగడ: జిల్లాలోని అంబొదల పోలీసులు శుక్రవారం రాత్రి అంబొదలలోని ఒక జూదగృహంపై ఆకస్మిక దాడులు చేశారు. ఈ సందర్భంగా ఏడుగురు జూదరులను అరెస్టు చేసి శనివారం కోర్టుకు తరలించారు. నిందితుల నుంచి 1,37,130 రూపాయల నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

సారాబట్టీలు ధ్వంసం



ధ్వంసమైన సారా బట్టీ

జయపురం : జయపురం సమితి గొడాపొదర్ పంచాయతీ కొలాగుడ అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న సారాబట్టీలపై జిల్లా అబ్కారీ ఫ్లయింగ్ స్క్వాడ్ శనివారం దాడులు నిర్వహించారు. 200 లీటర్ల సారా, 2,500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. వీటి విలువ రూ.లక్షా 45 వేలు ఉంటుందని అబ్కారీ అధికారి శశికాంత దత్ తెలిపారు. ఈ దాడుల్లో డి.ఎఫ్.ఎస్. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర పాడియారి, అబ్కారీ విభాగ ఐ.ఐ.సి.రాజకుమార్ క్షిడి పాల్గొన్నారు.

కాళీపూజకు ముహూర్తపు రాట



ముహూర్తపు రాట కార్యక్రమంలో కమిటీ సభ్యులు

రాయగడ: స్థానిక బ్లాక్ కాలనీ వద్ద ఈ నెల 31 నుంచి ప్రారంభం కానున్న కాళీ పూజలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు శనివారం మందిరం ప్రాంగణంలో ముహూర్తపు రాట కార్యక్రమం జరిగింది. ఆలయ ప్రధాన పురోహితుడు నళినీ కాంత్ దాస్ ఆధ్వర్యంలో సంప్రదాయపద్ధతిలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఫ్రెండ్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గత 41 ఏళ్లుగా కాళీ పూజలు జరుగుతున్నాయి. ఈ ఏడాది కూడా పూజలు ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు కొత్త కార్యవర్గం కూడా ఏర్పాటైంది. అధ్యక్షులుగా దిలీప్ పట్నాయక్, ఉపాధ్యక్షులుగా శివాజీ దాస్, సాధారణ కార్యదర్శిగా శివపట్నాయక్, కార్యదర్శిగా సంగ్రామ్ పట్నాయక్, కోశాధికారిగా గౌరి పట్నాయక్‌లు నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా నీలమాధవ పాడి, సునీల్ కుమార్ పాణిగ్రహి, దిలీప్ కుమార్ మిశ్రో తదితరులు నియమితులయ్యారు.

స్వేచ్ఛా కవనం



ఒకప్పుడు ఈ లాంచీలే శరణ్యం

ఎరుపు, నలుపు జెండాలు మాత్రమే తెలిసిన ఆ అడవిలో ఇప్పుడు మువ్వన్నెల వెన్నెల కాస్తోంది. 75 ఏళ్లుగా ఊరే ప్రపంచంగా బతుకుతున్న గిరిజనులకు బయట ప్రపంచం ఎలా ఉంటుందో ఇప్పుడే తెలుస్తోంది. ఎన్నికలు అంటే ఏంటో తెలియని ఆ అమాయకుల చేతి వేళ్లకు ఇన్నాళ్లకు సిరా చుక్క అంటుకుంది. మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి ఇప్పుడు ఒక రకమైన స్వేచ్ఛా వాయువులు పీలుస్తోంది. ఏళ్లకు ఏళ్లు విప్లవ నినాదాలు, ఆర్తనాదాలు విని అలసిపోయిన అడవి బిడ్డలకు బీఎస్ఎఫ్ జవాన్లు బయట ప్రపంచాన్ని పరిచయం చేయగలిగారు. రల్లేగేధ, పెప్పరమెట్ల, బోధపోధ, బోధపోధర్, జాంత్రీ, గాజుల్‌మమ్ముడి, పనాస్‌పూట్, జోడాంబో తదితర పంచాయతీల్లో సహాయ శిబిరాలు ఏర్పాటు చేసి మెల్లగా ఆ పల్లెలను మావోల నీడ నుంచి బయటకు తీసుకువచ్చారు. 2015 నుంచి ఇక్కడ కార్యకలాపాలు మొదలుపెట్టిన జవాన్లు 2024లో గిరిజనులు ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకునేంతలా ఇక్కడ ప్రగతి సాధించి చూపించారు. ఈ ప్రయాణంలో ఎంతో మంది జవాన్లు అసువులు బాసారు. కానీ ప్రయత్నాన్ని ఆపకుండా కొనసాగించి విజయం సాధించారు.

– మల్కన్‌గిరి



గ్రామాల్లో గిరిజనులతో చర్చిస్తున్న బీఎస్ఎఫ్ జవాన్లు



హంతాల్‌గూడ గ్రామం వద్ద తొలిసారి జాతీయ జెండా ఎగరేసిన జవాన్లు



గిరిజన యువతకు బయట ప్రపంచం చూపించడానికి తీసుకెళ్తున్న జవాన్లు



రహదారి సౌకర్యం లేక గుర్రాలు నడుపుతున్న గిరిజనులు



గ్రామాల్లోని జనసంపర్క్ శిబిరంలో దుస్తులు పంపిణీ చేస్తున్న జవాన్లు



అనునిత్యం కూంబింగ్‌లో పాల్గొంటున్న జవాన్లు



మావోలు అమర్చిన డంప్‌లను స్వాధీనం చేసుకున్న జవాన్లు



గుర్‌సేత్ బీఎస్ఎఫ్ క్యాంప్ పరిశీలిస్తున్న అధికారులు

నాడు రైతు.. నేడు డాక్టర్ రొయిమతి



మండియ రాణి రొయిమతి ఘివురియ

జయపురం: మండియా రాణి(చోడి రాణి)గా కీర్తినందుకున్న జయపురం సబ్‌డివిజన్ కుంద్రా సమితి లిమా గ్రామం మహిళా రైతు రొయిమతి ఘివురియాకు ఒడిశా వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయం వ్యవసాయ రంగంలో డాక్టరేట్‌తో సన్మానించేందుకు నిర్ణయించింది. ఈ నెల 24న రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతులమీదుగా వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయంలో సన్మానించనున్నట్లు ఒడిశా వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి. మండియా రాణి రొయిమతి పద్మశ్రీ అవార్డు గ్రహీత కమల పూజారి బావగారి కుమార్తె కావటం విశేషం. నేటి వరకు రొయిమతి 150 కి పైగా దేశీ చోడి విత్తనాలను సేకరించారు. వాటిలో దేశీ విత్తనాలు 130 రకాలు కాగా 20 విత్తనాలు హైబ్రీడ్ విత్తనాలు. వాటిని తోటి రైతులకు అందజేస్తూ దేశీ చోడి పంటలను ప్రోత్సహిస్తున్నారు. ఆమె ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ సెంటర్ జయపురం వారి సహకారంతో విత్తన సేకరణ చేస్తున్నారు. ఇదివరకు జి-20 సమ్మేళనంలో కూడా పాల్గొన్నారు.

దళారుల చేతిలో మోసపోవద్దు



సమావేశంలో పాల్గొన్న అధికారులు, రైతులు

● పత్తి రైతులకు కలెక్టర్ సూచన



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి, పక్కనే జెడ్పీ చైర్‌పర్సన్ సరస్వతి

రాయగడ: దళారుల చేతిలో మోస పోవద్దని పత్తి రైతులకు జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి సూచించారు. రాయగడ జిల్లాలో అత్యధిక శాతం మంది పత్తి వ్యవసాయం పైనే ఆధారపడుతుంటారన్నారు. అయితే ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధరను కూడా పొందకుండా దళారుల బారిన పడి మోసపోతుండటం పరిపాటిగా మారిందన్నారు. ఇకపై దళారుల వ్యవస్థకు స్వస్తిపలికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మండీల్లో పత్తిన రైతులు విక్రయించి వారి ఆర్థిక, సామాజిక రంగాల పురోభివృద్ధికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో పత్తి మండీల ఏర్పాటుకు సంబంధించి అధికారులతో శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ రైతు నుంచి పత్తిని కొనుగోలు చేసే విధంగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. మండీల్లో ఏర్పాటు చేసే తూనిక యంత్రాలు సరిగ్గా పనిచేసేలా అధికారులు చూడాలని ఆదేశించారు. నిఘానేత్రాలను కూడా అమర్చి రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చూడాలని అన్నారు. ప్రతీ వారం గుణుపూర్, రాయగడ సబ్ కలెక్టర్లు పత్తి కొనుగోలు, విక్రయాలపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్షా సమావేశాలను నిర్వహించాలన్నారు.

49,810 హెక్టార్లలో పత్తి సాగు

ఈ ఏడాది జిల్లాలోని 11 సమితుల్లో 49,810 హెక్టార్లలో పత్తి సాగయ్యిందని జిల్లా వ్యవసాయ శాఖ ముఖ్యఅధికారి బిష్ణ ప్రసాద్ ఖర్ తెలిపారు. దీని వల్ల ఈసారి సుమారు 7,23,252 క్వింటాళ్ల పత్తి దిగుబడి అయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. సకాలంలో రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చామన్నార. పత్తిని రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మండీల్లోనే విక్రయించి దళారుల చేతిలో మోసపోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామన్నారు. అవసరమైన ప్రాంతంల్లో చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు వివరించారు. సమీక్షా సమావేశంలో రాయగడ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, రాయగడ, బిసంకటక్ ఎమ్మెల్యేలు అప్పల స్వామి కద్రక, నీలమాధవ హికక, పలువురు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పేపరు మిల్లు విశ్రాంత కార్మికుల ఆందోళన



పేపరు మిల్లు ప్రధాన గేటు ముందు ఆందోళన నిర్వహిస్తున్న విశ్రాంత కార్మికులు

జయపురం: జయపురం గగణాపూర్‌లోగల సేవా పేపరుమిల్లు విశ్రాంత కార్మికుల ఆందోళన శనివారానికి 80 రోజులకు చేరింది. తమకు బకాయి వేతనాలు, పెన్షన్, పీఎఫ్, గ్రాట్యుటీ చెల్లించాలని వారు గత 80 రోజులుగా పేపరుమిల్లు ప్రధాన గేటు ముందు ఆందోళన చేస్తున్నారు. సేవాపేపరు మిల్లు ప్రథమ యూనియన్ అధ్యక్షుడు, ప్రముఖ కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి మాట్లాడుతూ 2016 నుంచి విశ్రాంత కార్మికులకు యాజమాన్యం బకాయి చెల్లించటం లేదని ఆరోపించారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతూ 30 మందికిపైగా కార్మికులు మృతి చెందారని, వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లు యాజమాన్యం ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కుతోందని తెలిపారు. ప్రభుత్వం కలగజేసుకుని మిల్లు పూర్తిస్థాయిలో నడిపేందుకు చర్యలు తీసుకోవాలని, విశ్రాంత కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. విశ్రాంత కార్మికుల బకాయిలు చెల్లించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

లావణ్యగడ వద్ద రోడ్డు ప్రమాదం

● వ్యక్తి మృతి
● మరొకరికి గాయాలు



గారబంద ఆరోగ్య కేంద్రంలో బైరాగి మృతదేహం

పర్లాకిమిడి: జిల్లాలోని గుసాని సమితి గారబంద పోలీసుస్టేషన్ పరిధి లావణ్యగడ గ్రామం వద్ద శనివారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం సంభవించింది. రెండు బైక్‌లు పరస్పరం ఢీకొన్న ఘటనలో ప్రాపతి బైరాగి (60) సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మరోకొరు గాయపడ్డారు. పి.బైరాగి ఆతని అల్లుడు బైక్‌పై గారబంద నుంచి ఆంధ్రాలోని శ్రీకాకుళం జిల్లా పలాసకు వ్యక్తిగత పనులపై వెళ్లి తిరిగివస్తుండగా.. లావణ్యగడ నుంచి అతివేగంతో వస్తున్న మరో బైక్ ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో బైరాగి, ఆయన అల్లుడు రోడ్డుకు ఆవలవైపు తుళ్లిపోయి పడిపోయారు. స్థానికులు బైరాగిని, ఆతని అల్లుడిని గారబంద ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం బైరాగి మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కాగా వ్యక్తి మృతి చెందాడని తెలుసుకున్న మరో వాహనదారుడు సంఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న గారబంద పోలీసు అధికారి ప్రశాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసును విచారించారు. బైరాగి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పర్లాకిమిడి కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భార్య గొంతుకోసిన భర్త అరెస్టు

మల్కన్‌గిరి: భార్య గొంతు కోసిన భర్తను అరెస్టు చేసినట్టు కలిమెల ఐఐసి చంద్రకాంత్ తండి శనివారం తెలిపారు. మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎంపీవీ-23 గ్రామానికి చెందిన మోనికతో వివేక్ మిర్ధాకు 11 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. అయితే ఈ దంపతుల మధ్య తరచు గొడవలు జరిగేవి. ఇదే క్రమంలో ఇటీవల భార్య మోరికపై భర్త వివేక్ మిర్ధా దాడి చేసి బ్లేడ్‌తో గొంతుకోసి పరారయ్యాడు. దీనిపై బాధితురాలి తండ్రి గణేష్ మేస్త్రీ కలిమెల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు గాలించి వివేక్ మిర్ధాను అరెస్టు చేసినటుట్ల చంద్రకాంత్ తండి చెప్పారు. నిందితుడుని సోమవారం కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

పారదర్శకంగా వరి సేకరణ

● రవాణా వాహనాలకు వీఎల్‌టీడీ అమరిక
● రవాణా కాంట్రాక్టు నిబంధనల సరళీకరణ




వరి రవాణా వాహనాలకు వెహికిల్ లొకేషను ఎస్టిమేటరు డివైస్ వీఎల్‌టీడీ వ్యవస్థ

భువనేశ్వర్: ఈ ఏడాది 86 లక్షల టన్నుల వరి సేకరణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మండీల్లో పోగైన వరి నాణ్యత పరీక్ష మొదలుకొని అట్టడుగు స్థాయి నుంచి ఉన్నత స్థాయి రైతు పంటకు పైకం చెల్లించే రీతిలో వ్యవస్థని క్రమబద్ధీకరిస్తున్నారు. ప్రధానంగా సన్నకారు, బలహీన రైతులకు ఏమాత్రం అన్యాయం జరగకుండా వరి కొనుగోలు జరగాలని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆదేశించారు. మండీల్లో వరి క్రయవిక్రయాలతో రవాణా వ్యవస్థలపై యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. సరుకు లోడింగులో అవాంఛనీయ జాప్యం నివారణకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా వరి రవాణా చేసే ట్రక్కుల కదలికపై నిరంతరం నిఘా ఉంటుంది. దీని కోసం వెహికిల్ లొకేషన్ ఎస్టిమేటరు డివైస్ వీఎల్‌టీడీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నవంబరు నెల 15 నాటికి ఈ పరికరం అమరిక పూర్తి చేయాలని వరి రవాణా చేసే ట్రక్కు యజమాన వర్గాలకు ఆదేశించారు. దీంతో వరి లోడింగు, అన్‌లోడింగు ప్రక్రియలో జాప్యం తొలగించడం సాధ్యం అవుతుందని భావిస్తున్నారు.

రాష్ట్రంలో ఈ ఏడాది 86 లక్షల టన్నుల వరి కొనుగోలు లక్ష్యంగా నిర్ధారించారు. ఈ ప్రక్రియలో రవాణా వ్యవస్థ కీలకంగా పరిగణిస్తున్నారు. అనుబంధ వర్గాల సమస్యల నివారణకు ప్రాధాన్యత కల్పించే దిశలో కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా కమిషనరు అమితాబ్ ఠాకూర్ అనుబంధ వర్గాలతో సమావేశమయ్యారు. ఒడిశా రాష్ట్ర పౌర సరఫరా సంస్థ ఓసీఎస్‌సీఎల్, ఒడిశా ట్రక్కు యజమానుల సమాఖ్య, రవాణా కాంట్రాక్టర్లు ఈ సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. వరి రవాణా కోసం టెండరు ఆహ్వాన దశ నుంచి పలు సంస్కరణల్ని ఒడిశా రాష్ట్ర పౌర సరఫరా సంస్థ చీఫ్ మేనేజరు సుధాకర సాహు ప్రతిపాదించారు. ఈ ఏడాది నవంబరు నెల ఆఖరు నాటికి వరి కొనుగోలు, రవాణా ప్రక్రియ ప్రారంభం కానుంది. మండీల్లో వరి నాణ్యత ఖరారుతో కొనుగోలు చేసిన సరుకు లోడింగు ముగియడంతో సంరక్షణ కోసం సత్వర చర్యలు చేపట్టేందుకు మిల్లర్ల వర్గం ప్రతినిధి ప్రత్యక్షంగా హాజరై ఉండాలి. వరితో నిండిన ట్రక్కు సీలు చేయడం, వర్షం ఇతరేతర పరిస్థితుల ప్రభావంతో ట్రక్కుల్లో నిండిన వరి దెబ్బ తినకుండా అనుబంధ కార్యకలాపాల్ని మిల్లర్ల ప్రతినిధి ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ప్రతిపాదించారు. రవాణా టెండర్ల ఆహ్వానం నిబంధనల సరళీకరణ చర్చనీయాంశమైంది. ఈఎండీ అనుపాతం 3 శాతానికి తగ్గించాలని ప్రతిపాదించారు. ట్రక్కులో వరి లోడింగు, అన్‌లోడింగులో అవాంఛనీయ జాప్యం తొలగించేందుకు సరికొత్తగా వాహనాలకు వెహికిల్ లొకేషను ఎస్టిమేటరు పరికరం జోడించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. వరి కొనుగోలు ప్రక్రియ ప్రారంభానికి సుమారు 15 రోజులు ముందుగా ఈ ఏర్పాటు పూర్తి చేయాలని ట్రక్కు యజమాని వర్గాలకు స్పష్టం చేశారు.

క్లుప్తంగా

కార్తీక స్నానాలకు చెరువు సిద్ధం



ఖుజురుబంద్ చెరువుని పరిశుభ్రం చేస్తున్న సిబ్బంది

జయపురం: కార్తీక మాసంలో భక్తుల స్నానాలు, పూజలకు అనువుగా స్థానిక ఖజురూబంద్ చెరువును మునిసిపాలిటీ అధికారులు శనివారం పరిశుభ్రం చేసే పనులు ప్రారంభించారు. కార్తీక మాసంలో దీపాలు విడిచిపెట్టేందుకు సౌలభ్యంగా చెరువులో ఉండే గుర్రపుడెక్క, మొక్కలను తెలగిస్తున్నారు. మునిసిపాలిటీ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని భక్తులు స్వాగతిస్తున్నారు.

లారీ, ద్విచక్ర వాహనం ఢీ

- యువకుడి దుర్మరణం

రాయగడ: లారీ, ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన జిల్లాలోని సదరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కుంభికోట వద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ ఘటనలో తొయంగిరి గ్రామానికి చెందిన శ్రీపతి సేనాపతి (34) ప్రాణాలు కోల్పోయినట్టు పోలీసులు తెలిపారు. రాయగడ వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న సేనాపతిని వెనుక నుంచి వచ్చి లారీ అదుపు తప్పి బలంగా ఢీకొట్టింది. దీంతో బైకుపై ఉన్న సేనాపతి కిందపడి తీవ్రంగా గాయపడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సేనాపతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

60 లీటర్ల సారా ధ్వంసం



సారాను పారవేస్తున్న పోలీస్

జయపురం: జయపపురం సమితి గొడొపొడర్ ప్రాంత అడవిలో శనివారం జయపుర అబకారి సిబ్బంది, జిల్లా ఫ్లైయింగ్ స్క్వాడ్ సంయుక్తంగా దాడులు చేపట్టారు. ఈ దాడులలో 60 లీటర్ల నాటు సారా, 90 లీటర్ల ఇప్ప ఊటను పారవేసినట్లు జయపురం అబ్కారి ఐఐసీ రాజకుమార్ క్షిడి వెల్లడించారు. నాటుసారాతోపాటు ఊట కూడా నిల్వ చేశారన్న సమాచారంతోనే దాడులు నిర్వహించామన్నారు.

కళాకారులకు సత్కారం



గజల్, సంగీత కళాకారులు

పర్లాకిమిడి: భువనేశ్వర్ రవీంద్ర మండపంలో శుక్రవారం భువనేశ్వర్ సర్కిల్ గజల్ సంగీత కార్యక్రమానికి ప్రసిద్ధ గజల్ కళాకారులు చందన్ గంతాయత్, వైష్ణవీ ఘోష్ హాజరయ్యారు. వీరి సంగీత కార్యక్రమానికి పర్లాకిమిడి సంగీత దర్శకులు రఘునాథ పాత్రో, ఐ.మన్మధరావు ఆధ్వర్యంలో నేపథ్య సంగీతం అందించారు. ఈ గజల్ సంగీత కార్యక్రమాన్ని విశ్రాంత ఐఏఎస్.అధికారి అరవింద బెహెరా ప్రారంభించారు. డిఫెన్స్ బ్రిగేడియర్ సుధాంశు మోహన్ పాణిగ్రాహి కళాకారులను పరిచయం చేశారు. గజల్ కళాకారులతోపాటు పర్లాకిమిడి సంగీత దర్శకులు రఘునాథ పాత్రో, ఇవటూరి మన్మధరావును సత్కరించారు. గాయకులు సంగీత గోసాయి, బిజోయి జెన్నా, గురు కుశమణి సాహు, గురు నిశాకాంత రౌత్రాయి తదితరులు పాల్గొన్నారు.

వివాహితపై లైంగికదాడి యత్నం

నందిగాం: మండలంలోని పెద్దబాణాపురం పంచాయతీ పెదినాయుడుపేటలో ఓ వివాహితపై అదే గ్రామానికి చెందిన యువకుడు లైంగికదాడికి యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ ప్రతిరోజూ వేకువజామున శ్రీపురం వెళ్లి కూరగాయలు తీసుకొస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం వేకువజామున 3.30 గంటలకు ఆటో తీసుకొని వెళ్లిపోగా.. ఇదే అదునుగా గ్రామానికి చెందిన తుంగాన భువనేశ్వర్ అనే వ్యక్తి ఆటో డ్రైవర్ ఇంట్లో చొరబడి అతని భార్యపై లైంగికదాడికి యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్సై షేక్ మహమ్మద్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

24న శ్రీమందిరానికి రాష్ట్రపతి రాక



ఛత్తీషా నియోగుల సన్నాహక సమావేశం

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. ఈ సందర్భంగా పూరీ శ్రీ మందిరం సందర్శించి రత్న వేదికపై మూల విరాట్లను దర్శించుకుంటారు. ఆమె దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు నేపథ్యంలో ఛత్తీషా నియోగుల సంఘం ప్రత్యేకంగా సమావేశమైంది.

తాత్కాలికంగా దర్శనం నిలిపివేత

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందర్శన సందర్భంగా శ్రీ మందిరం గర్భ గుడిలో దర్శనం తాత్కాలికంగా నిలిపివేతకు నిర్ణయించారు. ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 గంటల వరకు రాష్ట్రపతి శ్రీ జగన్నాథుని పూజాదుల్లో పాలు పంచుకుంటారు. ఈ సందర్భంగా ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి సాధారణ భక్తులకు సర్వ దర్శనం నిలిపివేస్తారు. రాష్ట్రపతి దర్శనం చేసుకుని తిరిగి వెళ్లిన తర్వాత దర్శనం యథాతథంగా పునరుద్ధరిస్తారు. రాష్ట్రపతి శ్రీ మందిరం లోనికి ప్రవేశానికి ముందు దైనందిన కార్యకలాపాలు ముగించాలని తీర్మానించారు. ఈ సర్దుబాటు కోసం వేకువ జాము 3 గంటలకు శ్రీ మందిరం సింహ ద్వారం తలుపులు తెరిచి ప్రాతః కాల పూజాదులు ప్రారంభిస్తారు. ఉదయం 11 గంటల వరకు సాధారణ భక్తులకు నిరవధికంగా సర్వ దర్శనం కల్పిస్తారు.

పరిమిత సేవకులకు అనుమతి

రాష్ట్రపతి పాల్గొనే పూజాదుల్లో యోగ్యులైన అర్చక వర్గానికి మాత్రమే అనుమతిస్తారు. ఇతర వర్గాల సేవకులకు అనుమతించరు. రాష్ట్రపతి కౌలిక పండాలకు మాత్రమే ప్రత్యేక పాసులతో లోనికి అనుమతిస్తారు. శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టరు అరవింద కుమార్ పాఢి అధ్యక్షతన ఆలయ కార్యాలయంలో జరిగిన ఛత్తీషా నియోగుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు.

ముఖ్యమంత్రితో ఆర్‌బీఐ గవర్నర్ భేటీ



భారతీయ రిజర్వు బ్యాంకు గవర్నరు శక్తి కాంత దాస్ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో శనివారం భేటీ అయ్యారు. ముంబైలో కొనసాగుతున్న ఉత్కర్ష్ ఒడిశా పెట్టుబడిదారుల సమావేశం సందర్భంగా వీరివురి మధ్య భేటీ జరిగింది.

- భువనేశ్వర్

ఒడిశా సివిల్స్ తుది ఫలితాలు వెల్లడి

- శ్వేత శ్రీ మహాపాత్రో టాపర్
- టాప్ 10 జాబితాలో 5 మంది మహిళలు



శ్వేత శ్రీ మహాపాత్రో

భువనేశ్వర్: ఒడిశా పబ్లిక్ సర్వీసు కమిషను ఓపీఎస్సీ ఆధ్వర్యంలో జరిగిన ఒడిశా సివిల్ సర్వీస్ పరీక్షల తుది ఫలితాలు శనివారం వెలువడ్డాయి. ఈ పరీక్షల్లో 683 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరంతా గ్రూపు -ఏ , గ్రూపు- బి ఉద్యోగాల్లో సివిల్స్ అధికారులుగా నియమితులు అవుతారు. ఓపీఎస్సీ అధికారిక వెబ్‌సైటు డబ్ల్యూ.ఒ జట ధి.జొరి.జీ ఽ ఫలితాల పూర్తి వివరాలు లభ్యం అవుతాయని ప్రకటించారు. శ్వేత శ్రీ మహాపాత్రో టాపర్‌గా నిలిచారు. ప్రింకిల్ పర్బీన్ పరిడా, దీప్తి రంజన్ పతి ద్వితీయ, తృతీయ స్థానాలతో ఉత్తీర్ణత సాధించారు. తొలి పది స్థానాల ఉత్తీర్ణుల్లో ఐదుగురు మహిళలు చోటు చేసుకోవడం విశేషం. ఈ పరీక్షల్లో మొత్తం 258 మంది మహిళలు ఉత్తీర్ణులు అయ్యారు.

భువనేశ్వర్: ఒడిశా సివిల్స్ పరీక్షల్లో శ్వేత శ్రీ మహాపాత్రో టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఆమెను గవర్నర్ రఘుబర్ దాస్ అభినందిచారు. శ్వేత శ్రీ మహాపాత్రొ తన ఉద్యోగ జీవితంలో అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

శ్రమకు ఫలితం తథ్యం

ఒడిశా సివిల్స్ పరీక్షల్లో టాపరుగా ఉత్తీర్ణత సాధించడం కఠిన పరిశ్రమకు దక్కిన ఫలితమని శ్వేత శ్రీ మహాపాత్రో తెలిపారు. ఈమె ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగులో ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థాయి ఉద్యోగంలో చేరారు. సివిల్స్ వంటి ఉన్నత శ్రేణి ఉద్యోగస్తురాలిగా ఎదగాలనే లక్ష్యంతో నిత్యం సగటున 7 నుంచి 8 గంటలపాటు నిర్విరామంగా శ్రమించారు. శ్రమకు తగిన ఫలితం చేకూరడంతో ఆనందానికి అవధులు లేకుండా పోయిందని ఉత్సాహం ప్రదర్శించారు.

టాప్ 10 వీరే..

ఒడిశా సివిల్స్ పరీక్షల్లో తొలి పది స్థానాల్లో శ్వేత శ్రీ మహాపాత్రో, ప్రింకిల్ ప్రబీణ్ పరిడా, దీప్తి రంజన్ పతి, ప్రజ్ఞా పరంగామా, ఆజాద్ కుమార్ సాహు, దీపం రౌత్, దేబబ్రొతా గౌడా, ఆదిత్య దీపంకర్ షడంగి, కపిల్ కుమార్ మహంతి, అమృత సాహు నిలిచారు.

రాష్ట్రపతి పర్యటనకు భారీ భద్రత: డీజీపీ

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి రాష్ట్ర పర్యటనను పురస్కరించుకుని భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లని రాష్ట్ర డైరెక్టరు జనరల్ ఆఫ్ పోలీసు శనివారం సమీక్షించారు. బ్లూ బుక్ ఆధారంగా రాష్ట్రపతి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 110 ప్లటూన్ల పోలీసులు రాష్ట్రపతి భద్రత కార్యకలాపాల్లో పాలు పంచుకుంటారు. 500 మంది సీనియర్ పోలీసు అధికారులు, 4 యూనిట్ల ఒడిశా విపత్తు స్పందన దళం ఒడ్రాఫ్, ఎస్‌టీయూ వర్గాల్ని ఈ కార్యకలాపాలకు నియమించారు. 3 మంది అదనపు డైరెక్టరు జనరల్ హోదాలో అధికారులు రాష్ట్రపతి భద్రతా ఏర్పాట్ల కార్యాచరణ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. రాష్ట్రంలో 3 రోజుల పాటు రాష్ట్రపతి పర్యటించనున్నారు. ఈ పర్యటన ఈ నెల 23వ తేదీ నుంచి ఆరంభం కానుంది. తొలి రోజున మయూర్‌భంజ్ జిల్లా రాయిరంగపూర్, బంగిరిపొషి ప్రాంతాల కార్యక్రమాల్లో రాష్ట్రపతి పాల్గొంటారు. మర్నాడు పూరీ పర్యటనలో భాగంగా శ్రీ మందిరం సందర్శన, గోపబంధు ఆయుర్వేద విద్యాలయం వజ్రోత్సవంలో పాల్గొంటారు. చివరిగా 3 రోజున భువనేశ్వర్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొని ఢిల్లీ తిరిగి వెళ్తారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

కంచిలి: ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో కొనుగోలు చేసి జలుమూరులోని నారాయణవలస సంతలో కబేలా వ్యాపారులకు అమ్మడానికి వాహనాల్లో తరలిస్తున్న గేదెలను కంచిలి పోలీసులు అడ్డుకున్నారు. పక్కా సమాచారం ప్రకారం కంచిలి జాతీ య రహదారిపై శనివారం ఉదయం పోలీసులు నిఘాపెట్టారు. ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు రెండు పికప్ వాహనాలు, సోంపేట మార్గంలో రైల్వే ఫ్ లై ఓవర్ బ్రిడ్జిపై మరొక పికప్ వాహనంలో మొత్తంగా 23 గేదెల్ని తరలిస్తుండగా అడ్డుకున్నారు. వీటిని తరలిస్తున్న ఆరుగురిపై వేర్వేరుగా కేసులు నమోదు చేశామని ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు.

తుఫాన్ కదలికలపై దృష్టి




డాక్టరు మృత్యుంజయ మహాపాత్రొ, ఐఎండీ, డీజీ.

భువనేశ్వర్: కేంద్ర అండమాన్ సముద్రంలో చోటు చేసుకుంటున్న వాతావరణ మార్పుల ప్రభావంతో తుఫాన్ సంకేతాలు బలపడుతున్నాయి. ఊహించిన మేరకు తుఫాన్ సంభవిస్తే దీన్ని దానాగా పేర్కొంటారు. అండమాన్ సముద్రం మధ్య భాగంలో చోటు చేసుకుంటున్న వాతావరణ మార్పుల కారణంగా తుఫాన్ సంభవించే అవకాశాలు ఇంత వరకు ఖరారు కాలేదని భారత వాతావరణ విభాగం డైరెక్టరు జనరల్ డాక్టర్ మృత్యుంజయ మహాపాత్రో శనివారం స్పష్టం చేశారు. ఆయన తెలిపిన సమాచారం ప్రకారం.. మధ్య అండమాన్ సముద్రంలో శనివారం ఏర్పడిన వాయుగుండం ఈ నెల 21వ తేదీ సోమవారం నాటికి అల్ప పీడనంగా మారే అవకాశం ఉంది. దీని ప్రభావంతో తూర్పు మధ్య బంగాళా ఖాతం, ఉత్తర అండమాన్ సముద్రం మీదుగా అల్ప పీడనం కదలిక ఉంటుంది. మరో 2 రోజులు సరికి ఈ వ్యవస్థ మరింత తీవ్రమై వాయువ్య దిశగా పయనించడంతో రాష్ట్రంలో ఈ నెల 23వ తేదీ నుంచి పలు ప్రాంతాల్లో భారీగా వర్షం కురుస్తుంది. సమగ్రంగా తుఫాన్ వాతావరణం అస్పష్టత కొనసాగుతుంది. అల్ప పీడన క్షేత్రం ఖరారు కావడంతో తుఫాన్ ఆవిర్భావం, కదలిక అనుబంధ వివరాల్ని నిర్ధారించేందుకు సాధ్యం అవుతుందని వివరించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 25వ తేదీ వరకు రాష్ట్రంలో వర్ష వాతావరణం నెలకొని ఉంటుందని తెలిపారు.

మత్స్యకారులకు హెచ్చరిక

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు చేపల వేట నివారించాలని అధికారులు తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి సముద్రం వైపు వెళ్లరాదని సూచించారు. ఇంతకు ముందు చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు ఈ నెల 21 నాటికి తీరం చేరాలని తెలిపారు.

రిసార్టుల నిర్మాణంపై ఆందోళన



మహేంద్రగిరిలో నిర్మించిన రిసార్ట్‌లు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని రాయఘడ బ్లాక్ కోయిపూర్ పంచాయతీలో ఉన్న ప్రసిద్ధ ఆధ్మాత్మిక, చారిత్రాత్మక టూరిస్టు కేంద్రం మహేంద్రగిరి పర్వతాలు. ద్వాపర యుగంలో పాండవులు మహేంద్రగిరి పర్వతాలలో కొన్ని సంవత్సరాలు తలదాచుకున్నట్టు స్థల పురాణంలో అనేక చారిత్రాత్మక కథలు ఉన్నాయి. బరంపురం నుంచి తుంబ రోడ్డు మీదుగా 91 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా మందస మండలం నుంచి లావణ్యగడ మీదుగా సుమారు 31 కిలో మీటర్ల దూరంలో మహేంద్రగిరి పర్వతాలు ఉన్నాయి. ఒడిశాలోని తూర్పుకనుమలలో మహేంద్రగిరి పర్వతాలు 1501 (రెండో అతి ఎత్తైన) మీటర్లు (4,925 అడుగులు) ఎత్తులో వున్నాయి. ఈ పర్వత కనుమలను పరిరక్షించాలని కేంద్ర టూరిజం శాఖ నిర్ణయించింది. దీంతో కేంద్ర, రాష్ట్ర టూరిజం శాఖలు మహేంద్రగిరిలో లక్షలాది రూపాయలతో ఇకోటూరిజం అభివృద్ధి, పర్యాటకులకోసం విడిది, రిసార్టులు నిర్మించారు. ఈ రిసార్టులు ప్రస్తుతం గజపతి జిల్లా అటవీ శాఖ పరిధిలో ఉన్నాయి.

సాధు, సంతవుల వ్యతిరేకత

మహేంద్రంలో బుర్‌ఖాత్‌పాస్ వద్ద ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన టూరిజం రిసార్ట్‌లు, క్యాంటీన్ల పట్ల గజపతి జిల్లా మహేంద్రగిరి పరిరక్షక మండలి, సాధు, సంతవులు వ్యతిరేకిస్తున్నారు. టూరిస్టులకు విడిది సౌకర్యం కల్పిస్తే మాంసాహారం, మద్యం సేవిస్తారని, ఇది మహేంద్రగిరి జీవ మండళాభివృద్ధికి దెబ్బతీస్తాయని భాస్కర తీర్థ లక్ష్మీబాబా అంటున్నారు. దీనిపై త్వరలో గజపతి జిల్లా పరిసర ప్రాంతంలో ఉన్న సాధు, సంతవులు జిల్లా కేంద్రంలో ఆందోళన చేస్తామని అంటున్నారు. అక్టోబర్ తొలి వారంలోనే టూరిస్టు రిసార్టులు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడా ప్రారంభోత్సవానికి సన్నహాలు చేశారు. ఎందువల్లే రిసార్టులు ప్రారంభం కాలేదు.

అనగనగా ఓ గోలెం



బియ్యంతో నిండుగా ఉన్న గోలేం

జలుమూరు: శ్రీముఖలింగం దక్షిణ కాశీ అని, ఇక్కడ శివలింగం ముఖం రూపం దాల్చి ఉంటుందని, శ్రీముఖలింగంలో ముఖ దర్శనం చేసుకుంటే మోక్షం సిద్ధిస్తుందని అందరికీ తెలుసు. కానీ ఇదే క్షేత్రంలో మరో కథ కూడా ఉంది. ఇక్కడి శివలింగం ఎంత ప్రత్యేకమో ఆ రూపం వెనక ఉండే గోలెం కూడా అంతే ప్రత్యేకం. ఈ గోలేనికి కూడా ఓ కథ ఉంది.

గోలేం కథ ఇది..

శ్రీముఖలింగం గ్రామానికి చెందిన కుమ్మరి నాగన్న ఎన్నో ఏళ్లుగా సంతానం లేకుండా బాధ పడుతుంటాడు. సంతానం కోసం స్వామిని ఎంతో భక్తి శ్రద్ధలతో పూజిస్తుంటాడు. తనకు కు మారుడు పుడితే ఓ పెద్ద మట్టి గోలేం చేసి దాని నిండా ఆవుపాలు పోసి అభిషేకం చేస్తానని మొక్కుకుంటాడు. కొన్నాళ్లకు నాగన్నకు ఓ కుమారుడు పుడతాడు. మొక్కు చెల్లించుకోవడానికి ఓ పెద్ద మట్టి గోలేం చేసి దాని నిండా పాలుపోసి దాన్ని గర్భాలయంలోనికి తీసుకుపోవడానికి ప్రయత్నిస్తాడు. అది గర్భ గుడి ద్వారం పట్టనంత పెద్ద గోలేం అవ్వడంతో తీసుకెళ్లలేకపోతాడు. దీంతో ఆలయం ముఖమంటపంలోనే గోలేంతోపాటు తన ఆ పరమ శివుడు ప్రసాదించిన బిడ్డను కూడా వదిలి ఇంటికి వెళ్లిపోతాడు. మర్నాడు స్వామి వారి నిత్యపూజలకై అర్చకులు గర్భగుడి తలుపులు తీసి చూడగా ఆ గోలేం మూలవిరాట్టు వెనకాల ఉంటుంది. అలాగే నాగన్నకు పుట్టిన బిడ్డకు కూడా గోలేం పక్కనే బోసినవ్వులతో ఆడుకుంటూ కనిపిస్తాడు. అప్పటి నుంచి భక్తులు తమ కోరికలు నెరవేరిన తర్వాత ఈ గోలెంలో మొక్కులు వేయడం ఆనవాయితీగా మారింది.



శ్రీముఖలింగం ప్రధాన ఆలయం


ఓఎస్ఎస్ఎస్సీ అక్రమాలపై లేఖాస్త్రం



పోస్టాఫీసు ప్రాంగణంలో గుమిగూడిన బాధిత యువత



భారత రాష్ట్రపతికి పంపిన లేఖ



రాష్ట్రపతికి లేఖాస్త్రం

భువనేశ్వర్:

రాష్ట్రంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టరు, అమీన్ ఉద్యోగాల భర్తీలో ఒడిశా రాష్ట్ర సబ్ ఆర్డినేటు స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఓఎస్ఎస్ఎస్సీ భారీ అక్రమాలకు పాల్పడిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలనే అభ్యర్థనతో ప్రభావిత నిరుద్యోగ యువత భారత రాష్ట్రపతి ద్రౌపదికి లేఖ రాశారు. ఈ లేఖని కటక్ అరుణోదయ మార్కెటు పోస్టు బాక్సులో వేశారు. వందలాది మంది అభ్యర్థులు వేర్వేరుగా లేఖపై సంతకం చేసి పోస్టు చేశారు. భారత రాష్ట్రపతి రాష్ట్ర పర్యటన పురస్కరించుకుని ఈ నిరసన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఉద్యమానికి స్టూడెంట్సు ఎగెనెస్టు కరప్షన్ (అవినీతి వ్యతిరేక విద్యార్థి వర్గం) సారథ్యం వహించింది. వీరి ఉద్యమం పలువురి దృష్టిని ఆకట్టుకుంది.

పుస్తెలతాడు చోరీ



బాధితులు పల్లి కనకమ్మ, కృష్ణమూర్తి

మెళియాపుట్టి : ఇంట్లో వంట చేస్తున్న వృద్ధురాలి మెడలో పుస్తెల తాడు అపహరించుకుపోయిన ఘటన మెళియాపుట్టి మండలం టకోయి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంతలక్ష్మీపురం పంచాయతీ టకోయి గ్రామానికి చెందిన పల్లికనకమ్మ అనే 65 ఏళ్ల వృద్ధురాలు శుక్రవారం రాత్రి ఇంట్లో వంట చేసుకుంటున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడ్డాడు. కరెంట్ మెయిన్ ఆఫ్ చేసి వృద్ధురాలి మెడలోని మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడు అపహరించుకుపోయాడు. బాధితురాలు కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు వచ్చిచూసేసరికి పారిపోయాడు. వృద్ధురాలి ఇద్దరు కుమార్తెలకు వివాహాలు జరిగాయి. భర్త కృష్ణమూర్తి గ్రామంలో ఆరుబయట కూర్చుని ఉండటంతో గమనించిన దుండగుడు ఈ దోపిడీకి పాల్పడినట్లు చెబుతున్నారు. కృష్ణమూర్తి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసునమోదు చేశారు. కాగా, గ్రామానికి చెందిన యువకుడే ఈ చోరీకి పాల్పడినట్లు అనుమానించి పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడిస్కిల్ సంయుక్తంగా పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (నర్సింగ్), ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సులకు సంబంధించి విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సెకెండ్ ఫ్లోర్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్, డిప్లమో, ఐటీఐ, పదో తరగతి పూర్తిచేసిన 18 నుంచి 28 ఏళ్ల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫారం, పుస్తకాలు అందిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 7680945357, 7995013422 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

పోలీసు అమరవీరులను స్మరిద్దాం

- 21 నుంచి 31 వరకు స్మారకోత్సవాలు
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



శ్రీకాకుళం క్రైమ్ : విధుల్లో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరులను స్మరించుకుందామని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 21 నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసు అమరవీరుల స్మారకోత్సవాలు అట్టహాసంగా ప్రారంభిస్తామని ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు.

- ఈ నెల 21 ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అమరవీరుల స్థూపం వద్ద ఎస్పీ ఆధ్వర్యంలో సంస్మరణ దినం నిర్వహించనున్నారు. స్మృతి పరేడ్ నిర్వహించి అమరులకు శ్రద్ధాంజలి ఘటించనున్నారు. ప్రతి పీఎస్ పరిధిలో ముఖ్య కూడళ్లు, పబ్లిక్ ప్రదేశాల్లో అమరవీరులకు గుర్తుగా బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తారు. అదే రోజు జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలోను, 21వ తేదీ నుంచి 31 తేదీల్లో ఎచ్చెర్లలోని పోలీసు కల్యాణ మండపంలో ఓపెన్ హౌస్ ప్రదర్శన నిర్వహిస్తారు.
- ఈ నెల 22 నుంచి 30 తేదీ మధ్య జిల్లాలోని పోలీసు అమరవీరుల గ్రామాలను డీఎస్పీలు సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి జ్ఞాపికలు అందిస్తారు. అమరులు చదివిన పాఠశాల, కళాశాలలకు వెళ్లి ఫొటోలు పెట్టి నివాళులర్పించేలా సూచించడం, గ్రామంలో ఏదైనా పాఠశాల, రోడ్డు, అభివృద్ధి పనులకు వారి పేర్లు పెట్టమని సూచించడం చేస్తారు.
- సైబర్ నేరాలు అరికట్టేందుకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై ఈనెల 24న శ్రీకాకుళం, 25న కాశీబుగ్గ, 26న టెక్కలి సబ్ డివిజన్‌ల పరిధిలో వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు పోలీసులు నిర్వహిస్తారు. పర్యావరణాన్ని పరిరక్షించడంలో పోలీసుల పాత్ర అనే అంశంపై పోలీసు సిబ్బందికి వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు 24న టెక్కలి, 25 ఆర్మ్‌డ్ పోలీసు సిబ్బంది, 26న శ్రీకాకుళం, 27న కాశీబుగ్గ సబ్‌డివిజన్‌ల పరిధిలో ఉంటాయి.
- 26, 27 తేదీల్లో మూడు సబ్‌డివిజన్లలో దేశభక్తిని తెలిపే చిత్రాలను జిల్లావ్యాప్తంగా ప్రదర్శిస్తారు. వన్‌డే, వన్‌హోమ్ థియేటర్, వన్‌షో కార్యక్రమం 23, 25 తేదీల్లో టెక్కలి, 26, 30 తేదీల్లో కాశీబుగ్గ, 28, 29 తేదీల్లో శ్రీకాకుళం సబ్‌డివిజన్‌లో నిర్వహిస్తారు.

– బ్లడ్ డొనేషన్ క్యాంపులను 28న జిల్లా పోలీసు కార్యాలయంలో, 29న టెక్కలి సబ్‌డివిజన్, 30న కాశీబుగ్గ సబ్‌డివిజన్‌లో నిర్వహిస్తారు.

– 29న డీఎస్పీలు, సీఐలు, పోలీసుల త్యాగాలపై ప్రముఖ వ్యక్తుల ద్వారా సెమినార్లు నిర్వహిస్తారు.

– 30న అమరవీరుల కుటుంబాల్లోని ప్రత్యేక విజయాలు సాధించినవారికి సన్మానం చేస్తారు.

– 31న జిల్లాకేంద్రంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమం నిర్వహిస్తారు.

క్లుప్తంగా

కోటదుర్గమ్మ హుండీల ఆదాయం లెక్కింపు


హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మవారి హుండీల ఆదాయాన్ని శనివారం లెక్కింపు చేపట్టారు. గత నెల 26 నుంచి ఈ నెల 19 వరకు హుండీల ద్వారా రూ.14,19,102 నగదు రూపంలో రాగా, 11గ్రాముల బంగారం, 470 గ్రాముల వెండి హుండీల ద్వారా భక్తులు సమర్పించారని ఆలయ ఈఓ సూర్యనారాయణ తెలిపారు. లెక్కింపులో ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన రమణ

చీపురుపల్లి: పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణకు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం జరిగిన వెంటనే రమణ అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఆయన్ను హుటాహుటిన జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. రాజాంలోని జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉద్యోగం చేస్తున్న రమణ ప్రతీ రోజూ మాదిరిగా శనివారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై బయిలుదేరి రాజాం వెళ్తున్నాడు. చీపురుపల్లి - రాజాం రోడ్డులోని అప్పన్నవలస నుంచి ఉల్లివలస జంక్షన్ మధ్య ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదం జరిగింది. దీంతో రమణ తలకు బలమైన గాయమవ్వడంతో అంతర్గతంగా అధిక స్థాయిలో రక్త స్రావం జరిగినట్లు వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికే ఒక శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యులు అత్యవసర విభాగంలో ఉంచారు.

ఆర్‌జీ పేటలో దొంగతనం

- 7 తులాల బంగారు చోరీ

లక్కవరపుకోట: మండలంలోని పలు గ్రామాల్లో దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. ఇటీవల శ్రీరాంపురం గ్రామంలో దొంగలు పడి సుమారు 16 తులాల బంగారు ఆభరణాలు దోచుకుపోయిన ఘటన మరువక ముందే ఆర్‌జీ పేట గ్రామంలోని ఒక ఇంటిలో ఈ నెల 13వ తేదీ రాత్రి దొంగలు పడి 7 తులాల బంగారం దోచుకుపోయారు. దీంతో మండల వాసులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ ఘటనపై ఎస్‌ఐ నవీన్‌పడాల్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ముత్యాల రాము ఈ నెల 13వ తేదీన గ్రామంలో జరిగిన ఒక వివాహ వేడుకకు వెళ్లి తిరిగి వచ్చి తమ బంగారు వస్తువులను బీరువాలో పెట్టి నిద్రించారు. తెల్లవారు జామున బీరువా తెరిచి వుండడం గమనించి వెతగ్గా బంగారు వస్తువులు కనిపించలేదు. దీంతో 18వ తేదీన పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం విజయనగరం క్రైంబ్రాంచ్ సీఐ సమక్షంలో క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌తో ఘటన స్థలం వద్ద పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ నవీన్‌పడాల్ తెలిపారు.

అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులకు పతకాలు


సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: జాతీయ స్థాయిలో జరిగిన సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో పతకాలు దక్కించుకుని క్రీడల ఖిల్లా విజయనగరం కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పారు. బాలుర అండర్ - 18 విభాగంలో పాల్గొన్న బి.హరీష్ 5000 మీటర్ల రేస్ వాక్‌లో సిల్వర్ మెడల్ దక్కించుకోగా.. అండర్ - 20 బాలుర విభాగంలో పాల్గొన్న ఎం.హరీష్ 5000 మీటర్ల రన్‌లో బ్రాంజ్‌మెడల్, 3000 మీటర్ల రన్‌లో గోల్డ్ మెడల్స్‌ను కైవసం చేసుకున్నారు. సౌత్‌జోన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను ఆల్ ఇండియా అథ్లెటిక్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ ఆకుల రాఘవరావు, రాష్ట్ర అసోసియేషన్ సీఈఓ హైమ, కార్యదర్శి గౌతమ్ కృష్ణ, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

రేపటి కలెక్టర్ పర్యటన రద్దు

సీతంపేట: ఐటీడీఏలో ఈ నెల 21న సోమవారం జరగనున్న పబ్లిక్ గ్రీవెన్స్‌కు కలెక్టర్ హాజరు కావడం లేదని, ఆయన పర్యటన రద్దయిందని పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత పబ్లిక్ గ్రీవెన్స్‌కు కలెక్టర్ వస్తారని ప్రకటించినా.. కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక యధావిధిగా జరుగుతుందని పేర్కొన్నారు.

ఈకేవైసీకి 8వేల మంది రైతులు దూరం

- ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులు 1,98,868 మంది
- ఈకేవైసీ చేసుకున్నది మాత్రం 1,90,499 మందే..


విజయనగరం మండలం రాకోడు గ్రామంలో ఈ పంట నమోదు చేస్తున్న వీఏఏ (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: పంటల సాగులో ఈ క్రాప్ నమోదు చాలా ప్రధానమైనది. పంటను విక్రయించుకోవాలన్నా, పంట నష్టం జరిగినప్పుడు పంటల బీమా పొందాలన్నా ఈ క్రాప్ నమోదు చేసుకుంటునే అవుతుంది. ఈ క్రాప్ నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలి. ఈ క్రాప్, ఈకేవైసీ చేయించుకుంటేనే రైతులకు రావాల్సిన పథకాలు, సౌకర్యాలు అందుతాయి. లేదంటే అందవు. అయితే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వేలాది మంది రైతులు ఈకేవైసీ చేయించుకోలేదు. ఈ క్రాప్ నమోదు చేయించుకున్నప్పటికీ ఈకేవైసీ మాత్రం చేసుకోలేదు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ క్రాప్, ఈకేవైసీ నమోదు గడువు ముగిసింది.

ఈ క్రాప్ చేసుకున్న రైతులు 1,99,868 మంది

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 1,98,868 మంది రైతులు 3.65 లక్షల ఎకరాలకు ఈ క్రాప్ నమోదు చేసుకున్నారు. ఈకేవైసీ మాత్రం 1,90,499 మంది చేసుకున్నారు. 8369 మంది ఈకేవైసీ చేయించుకోలేదు. వరి పంటకు సంబంధించి 1,68,836 మంది రైతులు 2,41,640 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు చేసుకున్నారు. ఈకేవైసీ 1,62,929 మంది రైతులు 2,35,800 ఎకరాలకు చేసుకున్నారు. 5907 మంది రైతులు 5840 ఎకరాలకు ఈకేవైసీ చేయించుకోలేదు. పత్తి పంటకు సంబంధించి 4,685 మంది రైతులు 4.137 ఎకరాలకు ఈ క్రాప్ నమోదు చేసుకున్నారు. 4,616 మంది రైతులు 4070 ఎకరాల్లో ఈకేవైసీ చేయించుకున్నారు. 69 మంది రైతులు 67 ఎకరాల్లో ఈకేవైసీ చేయించుకోలేదు. మొక్కజొన్న పంటకు సంబంధించి 19040 మంది రైతులు 17,687 ఎకరాలకు ఈ క్రాప్ చేసుకున్నారు. ఈకేవైసీ 18,258 మంది రైతులు 17,012 ఎకరాలకు చేసుకున్నారు. 782 మంది రైతులు 685 ఎకరాలకు ఈకేవైసీ చేసుకోలేదు. జీడిమామిడి పంటకు సంబంధించి 6482 మంది రైతులు 11,118 ఎకరాలకు ఈ క్రాప్ చేసుకున్నారు. 6,159 మంది రైతులు 10,519 ఎకరాలకు ఈకేవైసీ చేసుకున్నారు. 323 మంది రైతులు 599 ఎకరాలకు ఈకేవైసీ చేసుకోలేదు.

ఈ పంట, ఈకేవైసీ నమోదుతో ప్రయోజనాలు

- పంటల బీమా వర్తిస్తుంది.
- పంట రుణాలు తీసుకోవచ్చు.
- ఇన్‌పుట్, సబ్సిడీ, పంట నష్టపరిహారం అందుకోవచ్చు.
- పండించిన ధాన్యాన్ని అమ్ముకోవచ్చు.

97 శాతం ఈకేవైసీ పూర్తయింది..

ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి ఈకేవైసీ 97 శాతం పూర్తయింది. 8 వేలకు పైగా రైతులు ఈకేవైసీ చేయించుకోలేదు. ఈకేవైసీ చేయించుకోవాలని రైతు భరోసా కేంద్రం(రైతు సేవాకేంద్రం) సిబ్బంది పలుమార్లు ఈకేవైసీ చేయించుకోవాలని పలుమార్లు ప్రయత్నించినప్పటికీ రైతులు స్పందించలేదు. దీంతో కొంతమందికి ఈకైవేసీ జరగలేదు. – వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

విజ్జీ స్టేడియంలో క్రీడా సందడి

- క్రికెట్, హాకీ, త్రోబాల్ క్రీడాంశాల్లో క్రీడాకారుల ఎంపికలు


అండర్-17 క్రికెట్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు


అండర్-14, 17 విభాగంలో త్రోబాల్ జట్లకు ఎంపికైన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు విజ్జీ స్టేడియం ప్రాంగణంలో సందడిగా సాగాయి. శనివారం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ – 17 క్రికెట్ క్రీడాంశంలో బాల, బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించగా... ఉమ్మడి జిల్లాల నుంచి 130 మంది బాలురు, 20మంది బాలికలు పాల్గొన్నారు. వీరికి బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో వ్యక్తిగత సామర్థ్య పరీక్ష నిర్వహించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మంది బాలురకు, 16 మంది బాలికలకు జిల్లా జట్టులో అవకాశం కల్పించారు. ఎంపికల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అభినందించారు.

హాకీ... త్రోబాల్ జట్ల ఎంపికలు పూర్తి

అంతర్ జిల్లాల అండర్ – 14, 17 బాల, బాలికల హాకీ, త్రోబాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ఎంపికలు శనివారం విజ్జీ స్టేడియంలో పూర్తయ్యాయి. ఈ ఎంపికల్లో ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 48 మంది క్రీడాకారులను త్రోబాల్ జిల్లా బాల, బాలికల జట్లకు ఎంపిక చేశారు. అంతేకాకుండా 72 మంది క్రీడాకారులను హాకీ పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో రాష్ట్ర స్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ పోటీలకు జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కెవి.కృష్ణంరాజుతెలిపారు. ఎంపిక పోటీలను పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

నేడు బడిదేవర కొండపై రౌండ్ టేబుల్ సమావేశం

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి


మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి

పార్వతీపురం టౌన్: బడిదేవర కొండపై అక్రమ మైనింగ్ ప్రారంభమయ్యిందని, దానిని అడ్డుకునే బాధ్యత మనందరిపై ఉందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. దీనిపై ఆదివారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశం జయప్రదం చేయాలని కోరారు. స్థానిక సుందరయ్య భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016లో లైసెన్స్ ఇచ్చి రెవెన్యూ, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఉమ్మడి సర్వేలో రిజర్వ్ ఫారెస్ట్ అని తేలిన తర్వాత 2017లో గ్రానైట్ లైసెన్స్ రద్దు చేశారని, ఇప్పుడు మళ్లీ లైసెన్స్ పునరుద్ధరించడం అన్యాయమన్నారు. ఈ లైసెన్స్ పునరుద్ధరించిన మైనింగ్ ఎండీ వెంకటరెడ్డి తప్పుడు లైసెన్సులు ఇచ్చాడని సీబీఐ కేసుల్లో విచారణలో ఉన్నారని, అతనిచ్చిన లైసెన్సులు రద్దు చేయాలి, లేదా సస్పెండ్ చేయాలే గాని ప్రభుత్వం అలా చేయడం లేదని మండిపడ్డారు. ఏ కొండ మీద గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చారో అదే కొండపై గ్రానైట్ లైసెన్స్ ఇచ్చారని, ఇదంతా అక్రమమని వాపోయారు. దీనిపై చర్చించి తగు కార్యక్రమం తీసుకునేందుకు స్థానిక పార్వతీపురం, బెలగాం, సుందరయ్య భవనంలో ఆదివారం ఉదయం 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు, అభ్యుదయవాదులు, మేధావులు పాల్గొని బడిదేవర కొండపై తమ అభిప్రాయాన్ని పాలుపంచుకోవాలని కోరారు.

పైడితల్లి నిత్యన్నదానానికి రూ.లక్ష విరాళం


రూ.లక్ష చెక్‌ను సూపర్‌వైజర్‌కి అందజేస్తున్న విశ్వేశ్వరరావు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి నిత్యన్నదానానికి పట్టణానికి చెందిన విశ్వేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళాన్ని శనివారం ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలకు ఆలయ ఆవరణలో అందజేశారు. అమ్మవారి నిత్యన్నదానానికి భక్తులు అందజేస్తున్న విరాళం ఎనలేనిదని, మరింతగా దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాజేష్, దూసి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఎం సంస్థల కరస్పాండెంట్ సస్పెన్షన్

బొబ్బిలి: పట్టణంలోని సీబీఎం స్కూల్ భూ బదలాయింపు వివాదంలో కీలకమైన కరస్పాండెంట్ రత్నకుమార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారు. పట్టణంలోని సీబీఎం స్కూల్‌కు విద్యాశాఖాధికారులు రికగ్నైజ్ నోట్ ఇవ్వకపోవడంతో స్కూల్‌ను రద్దు చేసి ఈ పాఠశాలకు చెందిన స్థలాన్ని స్థానిక లోకబంధు విద్యాసంస్థలకు చెందిన స్థలంతో భూ బదలాయింపు చేసుకున్నారు. దీంతో పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు టీసీలు తీసుకుని వెళ్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో కరస్పాండెంట్‌ను ఈ వ్యవహారంలో బాధ్యుడ్ని చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వడం పట్టణంలో చర్చనీయాంశమైంది.

షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు : జేసీ


భూముల సర్వేపై ఆరా తీస్తున్న జేసీ ఎస్.ఎస్.శోభిక

పార్వతీపురం టౌన్: పార్వతీపురం డివిజన్ పరిధిలో ముందుగా నిర్ణయించిన తేదీల ప్రకారం గ్రామసభలను నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల అధికారులతో పార్వతీపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్వతీపురం డివిజన్‌లో ముందుగా ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం పక్కాగా గ్రామసభలను నిర్వహించాలన్నారు. ఇప్పటికే జరుగుతున్న గ్రామసభల నిర్వహణపై ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో రీసర్వేపై చేపట్టనున్న గ్రామసభల గురించి ముందుగా రైతులకు సమాచారం అందించాలన్నారు. తద్వారా రైతులందరూ అందుబాటులో ఉంటారని చెప్పారు. గ్రామసభకు ముందు రెవెన్యూ రికార్డులన్నీ సిద్ధం చేసుకోవాలని తెలిపారు. గ్రామాల వారీగా భూముల సర్వేపై ఆరా తీసిన ఆమె గ్రామసభల్లో రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించాలన్నారు. ఈ క్రమంలో రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను కూడా నమోదు చేసి, వాటిని సరి చేయాలని సూచించారు. అభ్యంతరాలు చేసిన రైతుల భూములను స్వయంగా పరిశీలించి, రీసర్వే పక్కాగా చేపట్టాలని అన్నారు. రెవెన్యూ రికార్డులు, రైతుల భూవివరాలు సరిపోయిన తదుపరి వాటిని ధ్రువీకరించాలని సూచించారు. రీసర్వేలో అలసత్వం, జాప్యం పనికి రాదని, నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జేసీ హెచ్చరించారు. సమావేశంలో పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోశ్ శ్రీవాస్తవ, డివిజన్‌లోని తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, మండల, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా ఉత్పత్తుల పరిశీలన


ఇత్తడి వస్తువులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ వెలుగు పీడీ సత్యంనాయుడు

బలిజిపేట: మండలంలోని గంగాడలో ఇత్తడితో తయారైన పంచలోహ దేవతా విగ్రహాలను డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు శనివారం పరిశీలించారు. ఈ నెల 21న విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి డ్వాక్రా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనకు ఇక్కడి ఇత్తడి విగ్రహాలను పంపిస్తామని తెలిపారు. ఆన్‌లైన్ మార్కెట్ ద్వారా విక్రయించేందుకు ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించారు. దీనివల్ల ఉత్పత్తిదారులకు జీవనోపాధి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీపీఎం అప్పారావు, లైవ్లీహుడ్ ఏపీఎం సతీష్, ఉన్నతి ఏపీఎం రామకృష్ణ, బలిజిపేట ఏపీఎం ఉమామహేశ్వరరావు, సీసీ కృష్ణ, వీఓఏ దాసు, తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో ‘అదితం’ ఉపకార వేతనాల పంపిణీ

- సెంచూరియన్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డి.ఎస్.రావు


ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ప్రొఫెసర్ డి.ఎస్.రావు, జి.ఎస్.ఎన్.రాజు

నెల్లిమర్ల రూరల్: టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసిస్తోన్న విద్యార్థులకు ఏటా అందజేసే అదితం లక్ష్మణరావు అండ్ శేషమ్మ మెమోరియల్ ట్రస్టు ఉపకార వేతనాలను వర్సిటీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డి.ఎస్.రావు చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వకాలంలో చదువులో ప్రతిభ చూపే విద్యార్థులకు గ్రామాల్లో వారాల బ్బాయి కింద భోజనాలు పెట్టేవారని గుర్తు చేశారు. నేడు నగదు పారితోషికం ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందన్నారు. రానున్న కాలంలో మరికొంత మందికి సెంచూరియన్ తరఫున ఉపకార వేతనాలు అందజేయడానికి కృషి చేస్తామన్నారు. ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం చేయడం వల్ల వారు ప్రయోజకులుగా ఎదిగి కుటుంబానికి అండగా నిలుస్తారన్నారు. ఈ ఏడాది ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న దున్న తేజ, ఫోరెన్సిక్ సైన్స్ మొదటి సంవత్సరం విద్యార్థిని కంది లావణ్యకు ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల చొప్పున ఉపకారవేతనాలు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, ప్రొఫెసర్ శాంతమ్మ, ఐక్యూఏసీ హెడ్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ డాక్టర్ సన్నీ డయోల్, డీన్ డాక్టర్ విజయ్‌బాబు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, బీబీఏ విభాగాధిపతి డాక్టర్ మోహన్‌బాబుతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో మహిళ మృతి


కేజీహెచ్‌లో సుశీల వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌ఐ

మెరకముడిదాం: మండలంలోని ఉత్తరావల్లి గ్రామానికి చెందిన ఎవర్న సుశీల (26) అగ్ని ప్రమాదానికి గురై మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఉత్తరావల్లి గ్రామానికి చెందిన సుశీల ఈ నెల 13న ఆదివారం తన ఇంట్లో కట్టెల పొయ్యి వెలిగించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కిరోసిన్ వేసింది. ఒక్కసారిగా మంటలు పెద్దవిగా రావడంతో సుశీల శరీరానికి మంటలు అంటుకొని తీవ్రంగా కాలిపోయింది. ఆమె కేకలు వేయడంతో భర్త గౌరీశంకర్ బంధువుల, గ్రామస్తులు ఆమెను విజయనగరంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ సుశీల చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతురాలికి కుమార్తె ఉంది. దీనిపై బుధరాయవలస ఎస్‌ఐ జె.లోకేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య


మామిడి చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందిన అప్పలనాయుడు

మెరకముడిదాం: మండలంలోని పతివాడపేట గ్రామ సమీపంలో వున్న మామిడి తోటలో ఎం.లింగాలవలస గ్రామానికి చెందిన సేనాపతి అప్పలనాయుడు(26) శనివారం ఉరి వేసుకొని మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు... దత్తిరాజేరు మండలం ఎం.లింగాలవలస గ్రామానికి చెందిన సేనాపతి అప్పలనాయుడు చెల్లాపురం గ్రామానికి చెందిన మీసాల వెంకటప్పలనాయుడు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా కొంత కాలంగా పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం కూడా ఇంటి నుంచి చెల్లాపురం వచ్చాడు. మధ్యాహ్నం వరకూ పని చేసిన అప్పలనాయుడు వున్నట్టుండి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. కొంతసేపు తరువాత పతివాడపేట గ్రామ సమీపంలో వున్న మామిడి తోటలో మామిడి చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందినట్టు పతివాడపేట గ్రామస్తులు మృతుడు కుటుంబ సభ్యులకు, చెల్లాపురం గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. దీంతో మృతుడు కుటుంబ సభ్యులు బుధరాయవలస పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ జె.లోకేష్‌కుమార్ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం బంధువులతో మాట్లాడగా అతను వ్యక్తిగత కారణాల వలన ఉరి వేసుకొని మృతి చెందాడని తెలిపారని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

కడుపునొప్పి తాళలేక...


మృతుడు జోగా జగన్నాథం

విజయనగరం క్రైమ్: కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి నేల బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండల పరిధిలో మజ్జిపేట గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి రూరల్ ఎస్‌ఐ వి.అశోక్ కుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. మజ్జిపేటకు చెందిన జోగా జగన్నాథం (35), వంట మనిషిగా పని చేస్తుండేవాడు. ఇతనికి భార్య రేవతి, ముగ్గురు కుమారులున్నారు. గత కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతూ ఉన్నాడని, శనివారం నొప్పి తట్టుకోలేక మజ్జిపేట దగ్గరలో ఉన్న నేల బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మృతుని భార్య రేవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు.

జీఎస్టీ అధికారులమంటూ హల్‌చల్


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మక్కువ : మండల కేంద్రంలో కేంద్ర జీఎస్టీ అధికారులమంటూ ఇద్దరు వ్యక్తులు కారులో శనివారం వచ్చి దుకాణాల వద్దకు వెళ్లి హల్‌చల్ చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. పలు దుకాణాల వద్దకు వెళ్లి దుకాణ యజమానుల నుంచి నగదు వసూలు చేశారు. తీసుకున్న నగదుకు రసీదులు ఇవ్వకపోవడంతో వ్యాపారులకు సందేహం వచ్చి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సాయిభగవాన్ కల్యాణ మండపం సమీపంలో కారును ఆపి వివరాలు అడిగారు. వారు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఇద్దరినీ విచారణ నిమిత్తం సాలూరు సర్కిల్ కార్యాలయానికి తరలించారు.

నేటితో ముగియనున్న అఖిల భారత డ్వాక్రా బజారు


డ్వాక్రా బజార్‌ను సందర్శించిన కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్ సతీమణి ప్రశాంతి

విజయనగరం అర్బన్: స్థానిక ట్యాంక్ బండ్ రోడ్డులో సరస్ పేరుతో పది రోజులుగా నిర్వహిస్తున్న అఖిలభారత డ్వాక్రా బజార్ ఆదివారం ముగియనున్నది. దేశ వ్యాప్తంగా 16 రాష్ట్రాల నుంచి వచ్చిన పొదుపు సంఘాల ఉత్పత్తుల కొనుగోలుకు ఆదివారం చివరి రోజు అని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డీఆర్‌డీఏ కల్యాణ్‌చక్రవర్తి పిలుపునిచ్చారు. శనివారం డ్వాక్రా బజార్‌ను సందర్శించిన వారిలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి ప్రశాంతి, మెప్మా పీడీ కె.సూర్య శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. డ్వాక్రా బజార్ ప్రాంగణంలో చిన్నారులు ప్రదర్శించిన నత్యాలు పలువురుని ఆకట్టుకున్నాయి.

ఏకలవ్య ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, వార్డెన్‌లకు షోకాజ్ నోటీసులు

సీతంపేట: శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో సీతంపేట మండలం వంబరెల్లి గ్రామానికి చెందిన సవర లావణ్య ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణవేణి, వార్డెన్ నాగేశ్వరిలకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్టు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో సకాలంలో సిబ్బంది స్పందించకుండా అలసత్వం వహించినందుకుగాను చర్యలకు ఉపక్రమించామన్నారు. శ్రీకాకుళం కలెక్టర్ ఆదేశాల మేరకు టెక్కలి ఆర్డీఓను విచారణాధికారిగా నియమించినట్టు తెలిపారు.

అసౌకర్యాల నడుమ సర్టిఫికెట్ల పరిశీలన


సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఈఓ పగడాలమ్మ

పార్వతీపురం టౌన్: కేజీబీవీల్లో బోధన, బోధనేతర సిబ్బంది ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు 900 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థుల నుంచి సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లను పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, మాస్టర్ డిగ్రీ, బీఈడీ, ఎంఈడీ, డిప్లమో సర్టిఫికెట్‌లను పరిశీలించారు. లోకల్ స్టేటస్, కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లను, దివ్యాంగులకు సంబంధించిన సర్టిఫికెట్లు, గతంలో పనిచేసిన అనుభవం ఉన్న వారి సర్వీస్ సర్టిఫికెట్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు.

అభ్యర్థులకు తప్పని అవస్థలు

సర్టిఫికెట్ల పరిశీలనకు 900 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ముందు రోజే అభ్యర్థులకు తెలియపరచడంతో జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు పట్టణానికి చేరుకున్నారు. పాఠశాల వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో వచ్చిన అభ్యర్థులు మండుటెండలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు అభ్యర్థులు చిన్న పిల్లలతో వెరిఫికేషన్ స్థలం వద్దకు చేరుకున్నారు. పాఠశాలలో ఒక తరగతి గదిలో 10 కౌంటర్లు ఏర్పాటు చేయడంతో తోపులాట మధ్య వెరిఫికేషన్ కార్యక్రమం గందరగోళంగా జరిగింది. మరోవైపు పాఠశాలలో విద్యార్థుల తరగతుల సమయం కావడంతో తరగతులకు, మధ్యాహ్న భోజనానికి విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు.